సాక్షి సిద్దిపేట

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



నిత్యం నెత్తు'రోడ్డు'తోంది

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వివరాలు IIలో ▸



వేదనలో రైతు వేదికలు

రైతు వేదికలు అధ్వానంగా మారాయి. ఎవరూ పట్టించుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వివరాలు IIలో ▸



తాగునీటి సమస్య రానివ్వం

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

రేపు బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలల్లో (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్) 6, 7, 8, 9వ తరగతులలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి, ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ (డీసీఓ) మహాదేవుని శివప్రసాద్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ నారాయణరావుపేట (ఎట్ చిన్నగుండవెల్లి)లో రెండు పరీక్ష సెంటర్లు, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ కేసీఆర్‌నగర్ డబుల్‌బెడ్‌రూం కాలనీ (సిద్దిపేట)లో ఒక పరీక్ష సెంటర్లలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అందువల్ల విద్యార్థులు ముందుగానే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, నిర్ణీత సమయం కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు అమలు

సిద్దిపేటకమాన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్న కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 20నుంచి 26వ తేదీ వరకు పై నిబంధనలు పాటించాలని కోరారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ప్రజలు గుమిగూడి ఉండకూడదన్నారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు.

నా భర్తను గల్ఫ్ దేశం నుంచి రప్పించండి

సీఎం, మంత్రులకు మహిళ వేడుకోలు



లింగయ్య

హుస్నాబాద్: అప్పుల బాధతో వేగలేక ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన నా భర్త అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడని, వెంటనే స్వగ్రామానికి రప్పించాలని భార్య రజిత ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాక్షితో మాట్లాడుతూ.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన చొప్పరి లింగయ్య, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. ఇక్కడ పని దొరక్క అప్పుల బాధతో భర్త లింగయ్య జగిత్యాలకు చెందిన శివకుమార్ అనే ఏజెంట్ సాయంతో గల్ఫ్ దేశానికి పేర్కొంది. నెల రోజులు మంచిగానే పని చేసి, ఇటీవలె అనారోగ్యానికి గురయ్యాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటికి వెళ్తాలంటే కంపెనీ వారు పాస్‌పోర్టు ఇవ్వడం లేదని, ప్రస్తుతం కాళ్లు పని చేయక నడవలేని పరిస్థితిలో ఉన్నాడని వాపోయింది. నా భర్తను తిరిగి రప్పిద్దామంటే తమ వద్ద డబ్బులు లేవని, అనారోగ్య సమస్యలతో నేను బతకలేనని ఏడుసుకుంటూ వీడియో తీసి పంపినట్లు చెప్పుకొచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ మా మీద దయతలచి నా భర్తను గల్ఫ్ దేశం నుంచి రప్పించాలని వేడుకుంటోంది.



ఆలయ మహామండపంలో చిన్నారుల అక్షరాభ్యాసాలు



సరస్వతి అమ్మవారి దివ్యమంగళరూపం

వాగ్దేవి నమోస్తుతే..

- వైభవంగా మూల మహోత్సవం
- భారీగా చిన్నారుల అక్షరస్వీకారాలు
- వర్గల్ క్షేత్రంలో భక్తిపారవశ్యం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రం శుక్రవారం మూల మహోత్సవ వేడుకలతో అలరారింది. ఓ వైపు భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన, మరోవైపు చిన్నారుల అక్షరస్వీకార పూజలతో శోభిల్లింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు గర్భగుడిలో సరస్వతి అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం జరిపారు.పట్టువస్త్రాలు, పూల మాలికలు, ఆభరణాలతో అలంకరించారు. చతుషష్ట్యోపచార పూజలు, లలితాపారాయణం, కుంకుమార్చన జరిపారు. భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన చేశారు. యాగశాలలో చండీ హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మహోత్సవంలో భక్తులు పాల్గొని సరస్వతి అమ్మవారిని, ఉప ఆలయాలలో దేవతామూర్తులను దర్శించుకుని తరించారు. అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా భారీగా చిన్నారుల అక్షరాభ్యాసాలు జరిగాయి.



సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు.



సీఎస్ఐ చర్చిలో భక్తులకు దైవ సందేశం అందిస్తున్న రెవరెండ ఆంథోనీ



ప్రభువా.. దీవించు

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ● అలరించిన భక్తిగీతాలు

గుడ్‌ఫ్రైడే సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అన్ని చర్చిలలో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ ఆంథోనీ భక్తులకు దైవ సందేశం వినిపించారు. ఈ సందర్భంగా యేసుప్రభు భక్తుల కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ప్రభువు చూపిన మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఈ సందర్భంగా భక్తి గీతాలను ఆలపించారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):

కదిలిస్తే కన్నీరే..!

ఈ ఫొటోలో కనిపిస్తున్నది రైతు బట్టు బాలయ్య. దుబ్బాక మార్కెట్ యార్డులో భారీ వర్షంతో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డాడు. కళ్ల ముందే కష్టార్జితం కొట్టుకుపోతుంటే కన్నీరు పెట్టడటం తప్పా.. మరో గత్యంతరం లేని నిస్సహాయస్థితి. ఇది ఒక్క రైతు బాలయ్యదే కాదు.. దుబ్బాక మార్కెట్ యార్డుతో పాటు జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో చాలా మంది రైతుల పరిస్థితి.



రైతులకు 'అకాల'దెబ్బ

- గాలివాన బీభత్సం
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- భారీ వర్షంతో కొట్టుకుపోయిన ధాన్యం
- 10 వేల క్వింటాళ్లకు పైగా తడిసిన వైనం
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పడరాని పాట్లు
- పిడుగులు పడి గేదెలు, దూడ మృత్యువాత



కొమురవెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

దుబ్బాక: జిల్లాలో శుక్రవారం ఉరుములు, మెరుపులు గాలి దుమారంతో కూడిన వర్షం అతలాకుతలం చేసింది. ఏకధాటిగా గంటకు పైగా వర్షం దంచి కొట్టడటంతో దుబ్బాక సహా చాలా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కళ్ల ముందే వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. దుబ్బాక మార్కెట్ యార్డులోనే నాలుగు వేల క్వింటాళ్లతో పాటు పలు కొనుగోలు కేంద్రాల్లో సుమారుగా 10 వేల క్వింటాళ్లకు పైగానే ధాన్యం తడిసింది. తూకం పెట్టిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దుబ్బాక మార్కెట్‌లో ఏ రైతును కదిలించినా కన్నీరే వస్తుంది.

ధాన్యం కొట్టుకుపోయింది

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మండల కేంద్రంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మున్సాలతో సహా కొన్నిచోట్ల ఇళ్ల పై కప్పులు లేచిపోయాయి. పోతిరెడ్డిపల్లిలో పిడుగుపడి రెండు గేదెలు, దూడ మృతి చెందాయి.



పిడుగు పడి మృతి చెందిన పాడి గేదె, దూడ వద్ద రైతు లలిత



కొండపాక మండలం దుద్దెడలో వర్షపు నీటిని బయటకు తోడేస్తున్న అన్నదాతలు



నేలకొరిగిన మామిడి చెట్టు

దెబ్బతిన్న మామిడి తోటలు

దుబ్బాకరూరల్: వరి పంటలతో పాటు మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లెదుటే దెబ్బతినడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. కొనుగోళ్ల కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది.



దుబ్బాక యార్డులో తడిసిన ధాన్యం

కూరగాయల తోటకు నష్టం

తొగుట(దుబ్బాక): కాన్గల్, ఘనపురం, గుడికందుల, గోవర్ధనగిరి, వర్ధరాజుపల్లి గ్రామా ల్లో వడగళ్లు కురిశాయి. వరిపంట, కూరగాయల తోటలకు కొంతమేరకు నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా వర్షం రావడంతో కొనుగోళ్ల కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.

నేలరాలిన వృక్షాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ర్యాగటోనిపల్లిలో ఓ ఇంటిపైకప్పు లేచింది. మామిడి చెట్టు నేలకొరిగింది. అలాగే పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఇద్దరికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో గాలివాన బీభత్సానికి ఇరువురు గాయపడ్డారు. వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేసీఆరే కావాలంటున్నారు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కేవలం 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారని, బీఆర్ఎస్‌ను ఓడించి తప్పు చేశామంటూ ఆవేదన చెందుతున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభపై దుబ్బాక మున్సిపల్, దుబ్బాక మండలం, మిరుదొడ్డి, భూంపల్లి–అక్బర్‌పేట మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలొచ్చినా వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలు అసహనంతో ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లినా.. ఎవరిని కదిలించినా కేసీఆరే కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండగా.. ప్రస్తుతం కాంగ్రెస్‌ను భరించలేకపోతున్నారని చెప్పారు. 25 ఏళ్ల బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు పండుగలా జరుపుకొందామని చెప్పారు. కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ఉండాలని, తాను అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, వెంకట నర్సింహారెడ్డి, రాజమౌళి, ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, వంశీకృష్ణ,, వనితా భూంరెడ్డి,శ్రీనివాస్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.



వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సిద్దిపేటలో ముస్లింల ర్యాలీ

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, తంజీమ్ ఉల్ మసాజిద్ అధ్యక్షులు హఫీజ్ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సిద్దిపేట ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే. మజీదుల వద్ద నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టం సక్రమంగా లేదన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు కాకుండా చూడాలన్నారు.

కొమురవెల్లిలో సమూల మార్పులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సమూల మార్పులకు ఈఓ అన్నపూర్ణ శ్రీకారం చుట్టారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆలయ ఉద్యోగులు, అర్చకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సిబ్బంది పంచె, తెల్ల చొక్కాతో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ఆలయంలో నిర్వహిస్తున్న వేద పాఠశాల విద్యార్థులు అన్నదాన సత్రం నుంచి టిఫిన్, భోజనం తెచ్చుకునే వారు.. గమనించిన ఈఓ శుక్రవారం వేద పాఠశాల ఆవరణలోనే వంటను ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆగమ సలహాదారు మహంతయ్య ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రెస్ కోడ్‌లో ఆలయ ఉద్యోగులు

చూస్తే అమృతం.. తింటే గరళం

అమృత ఫలం.. ఫలరారాజు మామిడి. సహజంగా మగ్గిన ఫలం ఎంతో రుచిగా ఉంటుంది. ఆ రుచి కోసం ధర ఎంతైనా మామిడిపండ్ల ప్రియులు వెనుకాడరు. ఈ బలహీనతనే కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పచ్చిగా ఉన్న కాయలను ఎథెఫాన్ (క్లోరో ఇథైల్ ఫాస్ఫోనిక్ ఆసిడ్) పౌడర్‌ను వినియోగించి కృత్రిమంగా మగ్గించి మామిడిపండ్లుగా అమ్మేస్తున్నారు. వాస్తవానికి ఎథెఫాన్ ప్యాకెట్‌ను నీటిలో తడిపికాయలకు తగలకుండా ప్రత్యేకంగా జాలీ ఉండే బాక్సులలో పెట్టి కాయలను ప్యాక్ చేయాల్సి ఉండగా వ్యాపారులు నేరుగానే మామిడికాయలపై చల్లేస్తున్నారు. ఇంత చేస్తున్నా ఆహార కల్తీ నిరోధకశాఖ కళ్లుమూసుకుని చోద్యం చూస్తోంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట:

మామిడిపండ్లలో ఎథెఫాన్ అధిక వినియోగం

- మామిడి కాయల పక్వానికి కాలకూటం
- ప్రజారోగ్యానికి పెను ప్రమాదం
- సిద్దిపేటలో మిట్టపల్లి, మొండ్రాయి, వంటిమామిడి శివారులో షెడ్‌లలో ప్యాకింగ్
- కళ్లుమూసుకున్న ఆహార కల్తీ నిరోధక శాఖ



మామిడి కాయల మండీ

మామిడి పండ్ల సీజన్ మొదలుకావడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే పక్వానికి రాని కాయల్ని సైతం వ్యాపారులు ఎథెఫాన్ రైపెనింగ్ పౌడర్‌తో పండ్లుగా మార్చేస్తున్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ నిబంధనల ప్రకారం పది కిలోలకు ఒక ప్యాకెట్‌ను అది కూడా జాలీ మాదిరిగా ఉండే బాక్స్‌లో పెట్టి కాయల మధ్యలో పెట్టాలి. కానీ, వ్యాపారులు దాదాపు రెండు కిలోలకు రెండు ప్యాకెట్ల చొప్పున నేరుగా కాయల మీద పెట్టి ప్యాక్ చేస్తున్నారు. ఇలా పది కిలోల మామిడి కాయలకు 10 ప్యాకెట్‌లనూ పెట్టేస్తుండటంతో అమృత ఫలాలు కాస్తా విషతుల్యాలుగా మారిపోతున్నాయి. ఎథెఫాన్ విచ్చలవిడి వినియోగం వల్ల పండ్లు సహజత్వాన్ని కోల్పోయి కృత్రిమ పక్వతను సంతరించుకుంటున్నాయి. పైకి పండ్లు నిగనిగలాడుతున్నట్లు కన్పిస్తున్నాయి. వీటినే ఇతర రాష్ట్రాలకు, స్థానికంగా తరలిస్తున్న తీరు విస్మయం కల్గిస్తోంది.



ఎథెఫాన్‌ను ఇలా బాక్స్‌లో పెట్టాలని సూచించిన ఆహార కల్తీ నిరోధక శాఖ



సిద్దిపేటలో మిట్టపల్లి శివారులో మామిడి కాయలపై నేరుగా ఎథెఫాన్ పౌడర్ ప్యాకెట్లను పెట్టి ప్యాక్ చేస్తున్న సిబ్బంది

కంటికింపుగా..

ఇలా మాగిన మామిడి పండ్లు కంటికి ఇంపుగా ఉంటాయి. ఈ పండ్లు అధికంగా తింటే తలనొప్పి, గొంతు నొప్పి, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఎథెఫాన్‌ను వినియోగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వేలకొద్దీ దిగుమతి చేసుకుని దర్జాగా సిద్దిపేట జిల్లాలో మిట్టపల్లి, మొండ్రాయి, గజ్వేల్ పట్టణ శివారు, వంటిమామిడి సమీపంలోని గోదాంలలో, ఖాళీ స్థలాల్లో బాక్స్‌లలో ప్యాకింగ్ చేసి ఢిల్లీ, నాగ్‌పూర్, ముంబయి, హైదరాబాద్‌లకు తరలిస్తున్నారు. వ్యాపారులతో లోపాయికారీ ఒప్పందం కుదరడంతో మామూళ్లు పుచ్చుకుంటూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సహజంగా పండించిన మామిడి పండ్లను మార్కెట్‌లో లభించే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తాం

"జిల్లాలో మామిడి ప్యాకింగ్ సెంటర్లు ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. త్వరలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తాం. అధిక మోతాదులో వినియోగించవద్దని వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం. అధికంగా ఎథెఫాన్‌ను వినియోగించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

–అనూష, ఇన్‌చార్జ్, ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా

- ఒకరికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

అక్కన్నపేట(హుస్నాబాద్): అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండా గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తండాకు చెందిన ధరావత్ రాజు శుక్రవారం మధ్యాహ్నం ఎప్పటిలాగే వ్యవసాయ క్షేత్రానికి ట్రాక్టర్‌ను తీసుకెళ్తున్నాడు. రామవరం గ్రామ పల్లె ప్రకృతి వనం వద్దకు రాగానే అదుపుతప్పి వనంలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. రాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిన్నపాటి వర్షానికే భారీ నీరు

- తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇబ్బందులు



నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి భారీగా నీరు చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వల్ప వర్షానికే అండర్ బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున నీరు చేరింది. చాలా ఏళ్లుగా ఈ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట


- సుమారుగా రూ.3 లక్షల వరకు నష్టం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో మొక్కజొన్న, గంధం మొక్కలు, ఇతర పంటలు బుగ్గిపాలయ్యాయి. ఈ ఘటన అక్కన్నపేట మండలం మైసమ్మ వాగుతండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో గ్రామానికి చెందిన జరుపుల రాజు పంటపొలంపై ఉన్న విద్యుత్ తీగలు పరస్పరం తాకి మంటలు చెలరేగాయి. మొక్కజొన్న పంటతోపాటు గంధం చెట్లు, ఇతర తోట, పైపులపై మంటలు పడటంతో పూర్తిగా కాలి బూడిదై పోయాయి. కళ్లముందే పంట కాలిపోయిందని రైతు రాజు వాపోతున్నాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పారు. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటినట్లు రైతులు అంచనా వేశారు. ప్రభుత్వం స్పందించి రైతుకు నష్టపరిహారం అందివాలని తోటి రైతులు కోరుతున్నారు.

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్



మహిళ కడుపులో నుంచి తొలగించిన కణతి

దుబ్బాకటౌన్: దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆస్పత్రిలో శుక్రవారం వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. మహిళ కడుపులో నుంచి మూడున్నర కిలోల కణతిని తొలగించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన గున్నాల రాజమణి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా, అక్కడి వైద్యులు పరీక్ష చేసి, కడుపులో ఒవిరియన్ సిస్ట్ కణతి ఉందని నిర్ధారించారు. దీంతో రెండు రోజుల క్రితం ఆమె దుబ్బాక ఆస్పత్రిలో చేరింది. సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించి మూడున్నర కిలోల కణతిని తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

నిత్యం నెత్తిరోడ్డుతోంది

- ప్రమాదాలకు నిలయంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రోడ్లు
- చుట్టుపక్కల ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు
- రోజూ టిప్పర్లు, భారీ వాహనాల రాకపోకలు
- రోడ్లపైనే మట్టి కుప్పలు, పార్కింగ్‌లతో ఇబ్బందులు
- మూడేళ్లలో 21 మంది మృతి, 51 మందికి గాయాలు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన స్థానికులు
- ఆదేశాలతో ప్రమాద ప్రాంతాలు పరిశీలించిన అధికారులు



రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డుపై వేగంగా వెళ్తున్న నంబర్ లేని టిప్పర్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తెల్లాపూర్ ప్రాంతంలో రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కలెక్టర్ చెబితే కాని అధికారులకు విధులు గుర్తు రావడంలేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు



ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా మలుపు

శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్‌కు వచ్చే మార్గం, రేడియల్ రోడ్డు నం.7 సర్కిల్, ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు ఏలియాన్స్ సర్కిల్, రాజ పుష్ప సర్కిల్, తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే హుడా రోడ్డులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. కొల్లూరు రింగ్ రోడ్డును ఆనుకొని సర్వీస్ రోడ్డుపై సైతం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

భారీ వాహనాల రాకపోకలు

ఈ ప్రాంతంలో జోరుగా భవంతుల నిర్మాణాలు సాగుతున్నాయి. దీంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. నిర్మాణాల కోసం తవ్విన మట్టిను పెద్ద పెద్ద టిప్పర్‌లలో తరలిస్తున్నారు. టిప్పర్‌లకు వెనుక భాగంలో నంబర్ ప్లేట్‌లు లేకుండా రాకపోకలు సాగిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్లు సైతం ఈ రోడ్లపై అతి వేగంతో దూసుకొని పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ ప్రధాన రోడ్లపై గడిచిన మూడేళ్ల కాలంలో 21 మంది మృతి చెందగా, 51 మంది గాయపడ్డారు. ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు.

కఠిన చర్యలు తప్పవు



ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మితిమీరిన వేగంతో వెళ్లే వారిపై కఠినంగా వ్యవరిస్తున్నాం. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు పూర్తిస్థాయిలో తగ్గిపోతాయి.

– విద్యాసాగర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

కలెక్టర్ దృష్టికి రోడ్డు ప్రమాదాలు

నిత్యం తెల్లాపూర్ పరిధిలోని రోడ్లపై ప్రమాదాలు జరిగి అనేక మంది మృతి చెందడం, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో అధికారులు పూర్తి విఫలం కావడంతో స్థానికులు ఈ విషయాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. వెంటనే మున్సిపల్, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్ పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సందర్శించారు. కలెక్టర్ చెబితే గాని అధికారులకు విధులు గుర్తు రావడం లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



కలెక్టర్ ఆదేశాలతో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

వేదనలో రైతు వేదికలు



ముస్లాపూర్ రైతు వేదికలో కిందపడిన ట్యాంకు



పేరుకుపోయిన చెత్తాచెదారం

- ఊడ్చే వారు లేరు, పట్టించుకునే వారు కరువు
- నిర్వహణకు నిధులు లేవంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): పంట సాగులో అధునాతన పద్ధతులను ఎప్పటికప్పుడూ రైతులకు తెలియజేస్తే ఉద్దేశ్యంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన రైతు వేదికలు అధ్వానంగా మారాయి. నిత్యం వాటిని ఊడ్చేవారు లేక.. ఎవరూ పట్టించుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మొక్కుబడిగా రైతు వేదికలలో అపుడప్పుడు వ్యవసాయాధికారులు సమావేశాలు మాత్రం నిర్వహిస్తున్నారు. రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడం, పంటల బీమా, రైతు బంధు ఇతర వివరాలను ఎప్పటికప్పుడూ అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసింది. మెదక్ జిల్లాలో 76 రైతు వేదికలను ప్రభుత్వం మంజూరు చేసి రూ. 22 లక్షలతో రైతు వేదిక భవనాలు నిర్మించారు. ఈ భవనాలు వినియోగించకపోవడం, నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు క్లస్టర్ అధికారులు రైతు వేదికల వైపే కన్నెత్తి చూడటం లేదు. అల్లాదుర్గం మండలంలో 4 రైతు వేదికలు నిర్మించారు. ఇందులో మండల కేంద్రంలో వ్యవసాయాధికారులు ఉంటూ వినియోగిస్తున్నారు. ముస్లాపూర్ గ్రామంలోని రైతు వేదిక నాలుగేళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. వేదికలను ఎవరూ ఊడ్చక పోవడంతో అందులో అడుగు పెట్టడం లేదని రైతులు చెబుతున్నారు.

గోదాంలుగా రైతు వేదికలు

రైతు వేదికలు కొనుగోలు కేంద్రాలకు గోదాంలుగా మారుతున్నాయి. వరి, జొన్నల కేంద్రాలను రైతు వేదికలలో ఏర్పాటు చేయడంతో ధాన్యం బస్తాలు వేస్తూ గోదాంలుగా మార్చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం నుంచి ఒక నెల రోజులపాటు వీటిని వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని రైతు వేదికలను వినియోగంలోకి తెచ్చి శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదన్నారు. జిల్లా కొన్ని రైతు వేదికలను పూర్తి చేయలేదని, మాకు అప్పగించలేదని తెలిపారు.

తల్లీకుమారుడు అదృశ్యం



కుమారుడితో లావణ్య

జగదేవపూర్(గజ్వేల్): తల్లీ కుమారుడు అదృశ్యమైన ఘటన మండలంలోని దౌలాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దౌలాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర పోచమ్మ, మల్లయ్య కూతురు లావణ్యను పదేళ్ల కిందట గజ్వేల్ మండలం కొల్గురు గ్రామానికి చెందిన వేముల కృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి స్వరణ్ దీప్, దీక్షిత్ ఇద్దరు కుమారులు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో పది నెలల నుంచి లావణ్య చిన్న కొడుకు దీక్షిత్‌తో కలిసి దౌలాపూర్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. గురువారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కొల్గురులోని భర్త కృష్ణకు ఫోన్ చేసి అడుగగా రాలేదని చెప్పారు. శుక్రవారం లావణ్య తల్లిదండ్రులు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి మహిళ

మునిపల్లి(అందోల్): మహిళ అదృశ్యమైన ఘటన కంకోల్ గ్రామంలో చోటు చేసుకుంది. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన లింగంపల్లి నర్సమ్మ (55) తన ఇంట్లో నుంచి గోందాళంకు అవసరమైన పుస్తె మెట్టెలకు బుధవారం ఉదయం సదాశివపేటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావించారు. అక్కడికి వెళ్లకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న మైనర్లు

బైక్‌ల చోరీలకు పాల్పడుతూ మైనర్లు పట్టుబడటం కలకలంరేపింది. జహీరాబాద్‌కు చెందిన ఇద్దరు చదువుకుంటున్న యువకులు పార్కింగ్ చేసిన బైక్‌లే లక్ష్యంగా ఏడాదిగా చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే జిన్నారంలో ఓ వ్యక్తితో కలిసి ఏడుగురు యువకులు పలు ప్రాంతాల్లో బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతూ దొరికిపోయారు. శుక్రవారం పోలీసులు 9 మంది మైనర్లను అరెస్ట్ చేసి చోరీల వివరాలు వెల్లడించారు.

- పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యం
- జహీరాబాద్‌లో ఇద్దరు యువకులు అరెస్ట్
- 8 వాహనాలు, కత్తులు స్వాధీనం




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, పక్కన సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్ టౌన్: పార్కింగ్ చేసిన మోటారు బైక్‌లను అపహరించిన కేసులో ఇద్దరిని జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 8 వాహనాలు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, టౌన్ సీఐ శివలింగంతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌కు చెందిన ఎండీ అల్తాఫ్ హుస్సేన్(19) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధికి చెందిన నేపాలి సాయి చరణ్(16) చైతన్య స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి ఏడాది నుంచి పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేస్తున్నారు. దొంగతనం చేసే సమయంలో ఎవరైనా అడ్డు వస్తే వారిపై కత్తులతో దాడి చేస్తుంటారు. ఇప్పటి వరకు జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, హైదరాబాద్‌లో పలు బైక్‌లను చోరీ చేశారు. జహీరాబాద్ పోలీసులు పట్టణంలోని బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్, స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను అనుమానంతో ఆపి విచారించగా బైక్‌ల చోరీలు బయట పడ్డాయి. బాల నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8 బైక్‌లు రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. అనంతరం టౌన్ సీఐ శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్ ఐడీ పార్టీ సిబ్బందిని అభినందించారు.

గుమ్మడిదలలో ఏడుగురు, ఓ వ్యక్తి అరెస్ట్


జిన్నారం (పటాన్‌చెరు): బైక్ చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు మైనర్లు, ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. శుక్రవారం గుమ్మడిదల టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి నంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తూ కనిపించారు. వారిని ఆపి విచారించగా ఇందులో ఒకరు ప్రేమ్ కుమార్ అని ఎలక్ట్రీషన్ వృత్తి చేస్తుంటాడని చెప్పారు. మరో వ్యక్తి మైనర్ ఉన్నాడు. బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. వీరు ఇచ్చిన సమాచారం మేరకు హైదర్‌నగర్ మియాపూర్‌లో మరో ఆరుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నాం. ఎనిమిది మంది కలిసి గుమ్మడిదల పీఎస్ పరిధిలో 2 బైక్‌లు, స్కూటీ, దుండిగల్‌లో 2 బైక్‌లు, నర్సాపూర్‌లో బైక్, చిట్యాలలో బైక్ మొత్తం 7 వాహనాలను చోరీ చేశామని ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైక్‌లతోపాటు 4 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో జిన్నారం సీఐ నయీముద్దీన్, గుమ్మడిద ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కూల్ డ్రింక్‌లో బల్లి అవశేషాలు

- తాగడంతో యువకుడి అస్వస్థత



సీసాలో బల్లి అవశేషాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కూల్ డ్రింక్‌లో బల్లి అవశేషాలు కనిపించడం మండల కేంద్రంలో శుక్రవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. సదాశివపేట పట్టణానికి చెందిన ముస్తఫా, చారి, నరేశ్, యాదుల్ నలుగురూ నాగ్సాన్‌పల్లి శివారులోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ కూల్ డ్రింక్ తీసుకోగా యాదుల్ తాగాడు. అనంతరం వాంతులు చేసుకున్నాడు. అనుమానం వచ్చి అతడి స్నేహితుడు ముస్తఫా సీసాలో చూడగా చిన్న బల్లి కాలు అవశేషాలు కనిపించాయి. యువకుడు వెంటనే రెస్టారెంట్‌కి వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశాడు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. వెంటనే యాదుల్‌ను సదాశివపేట పట్టణంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సదరు రెస్టారెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విగ్రహాల ఏర్పాటులో ఇరువర్గాల ఘర్షణ


ఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ ప్రసన్నకుమార్



ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో విగ్రహాల ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొల్చారంలో రహదారి పక్కన 14న అంబేడ్కర్ విగ్రహాన్ని తెల్లవారుజామున ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి చెందిన వీహెచ్‌పీ నాయకులు స్థలం చదును చేసి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు జెండాలు పాతారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఐదు రోజుల నుంచి ఘర్షణ వాతావరణం నెలకొంది. శుక్రవారం రెండు వర్గాలు స్థలం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎవరికి వారు మద్దతుగా నినాదాలు చేస్తూ తోపులాటకు యత్నించారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్ గౌస్ విగ్రహాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. పరిస్థితి అదుపులోకి రాక పోవడంతో ప్రత్యేక బలగాలతో ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. రాత్రికి రాత్రి విగ్రహాల ఏర్పాటు సరికాదని,విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఉందని, పూర్తి అనుమతులు తీసుకున్న తర్వాతే ముందుకు సాగాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఇద్దరు మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రేడియల్ రోడ్డు నం.7లో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 45 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే కొల్లూరు పోలీసులను సంప్రదించాలని కోరారు.

గంగ్వార్ గ్రామ శివారులో మరొకరు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగ్వార్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తూ మార్గమధ్యలో గంగ్వార్ గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలై అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 56769 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జేసీబీ, టిప్పర్ పట్టివేత

కొండపాక(గజ్వేల్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్, జేసీబీని టాస్క్ ఫోర్సు పోలీసులు పట్టుకొని కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగోల్ గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం మల్లన్నసాగర్ కాలవ పక్కన నిల్వ ఉన్న మట్టిని అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల వెంచర్లలోకి రవాణా చేస్తున్నారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, సివిల్ పోలీసులు రైడ్ చేసి మట్టిని తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారని, టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

పండుగ రోజు తోటి పిల్లలతో ఆడుకుంటుండగా ప్రమాదం



సాయి ప్రణీత్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తుక్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన చికుడ్క స్వామి, కళావతి దంపతులకు కుమారులు ప్రణత్, సాయి ప్రణీత్ (12) ఉన్నారు. గ్రామంలో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించేందుకు దేవాలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ క్రమంలో డెకరేషన్ వైరు ఇనుప పైపునకు తగిలి ఉంది. గురువారం రాత్రి స్వామి ఇద్దరు కుమారులతోపాటు మిత్రుడు ఈశ్వర్‌తో కలిసి ఆలయం వద్దకు వెళ్లారు. సాయి ప్రణీత్ తోటి పిల్లలతో ఆడుకుంటూ ఇనుప పైపునకు తగలడంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పండుగ వాతావరణంలో బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. బాలుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో ఒకరు

కోహెడ(హుస్నాబాద్): వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన వేముల శంకరయ్య(59) కుమారుడు రమేశ్ పాత బస్టాండ్ వద్ద హోటల్ నిర్వహిస్తున్నారు. శంకరయ్య రోజూ హోటల్‌లో కుమారుడికి సాయం చేస్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం హోటల్‌లో పని చేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు.

పాము కాటుతో రైతు



అంజయ్య (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి) : పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నాగుల్ దేవులపల్లి గ్రామానికి చెందిన రైతు దూడీ అంజయ్య(55)కి గ్రామ శివారులో మూడు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. వరి పంట సాగు చేసి కొంతమేర కోయించాడు. మిగతా పంట కోసేందుకు చూసి రావడానికని గురువారం రాత్రి పొలంలో వద్ద వెళ్లాడు. పొలం చూస్తుండగా అంజయ్య ను పాము కాటు వేసింది. వెంటనే పొలం నుంచి ఇంటికొచ్చి కొడుకు నవీన్‌కు విషయం చెప్పి కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఇంటి వద్దే మృతి చెందాడు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రోడ్డుపై పడిపోయి వ్యక్తి..

తూప్రాన్: రోడ్డుపై పడిపోయి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపూర్(పిటీ) శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన సిదు రమేశ్(38)కి శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన అభినయతో వివాహం జరిగింది. రమేశ్ బీపీ, షుగర్‌తోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అభినయ పుట్టింటి వద్దే ఉంటుండగా రమేశ్ అప్పుడప్పుడూ భార్యాపిల్లలను చూసి పోవడానికి గుండ్లపల్లికి వస్తుంటాడు. తూప్రాన్ సమీపంలోని సుగుణ పరిశ్రమ వద్ద శుక్రవారం రమేశ్ పడిపోయి ఉన్నాడని స్థానికులు అభినయకు ఫోన్‌లో చెప్పారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



రమేశ్ మృతదేహం

మోటార్ మరమ్మతు చేస్తుండగా..



పోచయ్య(ఫైల్)

మర్కూక్(గజ్వేల్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చేబర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ దామోదర్ కథనం మేరకు.. మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన ఎలిమల పోచయ్య (50) వ్యవసాయ పొలంకు కొండపోచమ్మ సాగర్ కాల్వలోంచి బోరు మోటార్‌ను బిగించాడు. ప్రతి రోజూ కాల్వ ద్వారా పొలంకు నీటిని పారిస్తున్నాడు. శుక్రవారం బోరు మోటారు పని చేయకపోవడంతో కాల్వలోకి దిగి మరమ్మతు చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.